క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ హనూక్

పెనుబల్లి: పెనుబల్లి క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను సత్తుపల్లి రూరల్ సీఐ సీహెచ్ హనూక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఈవీ రమేష్, కోటగిరి సుధాకర్, ఎస్వీకే ప్రసాద్, బొర్రా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రాజా, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టాపర్‌గా 'మర్లపాడు' విద్యార్థి

మధిర: ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌లో మధిర మండలంలోని మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని నెల్లూరి దివ్యభాను జిల్లా టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట వెంకట్ కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ కనకారావు, పాఠశాల ఉపాధ్యాయులు సయ్యద్ జానీ, నాగేశ్వరరావు, లాల్ అహ్మద్, శ్రీనివాస్, రమాదేవి, కృష్ణ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామారావు, సిబ్బంది తదితరులు ఆమెను అభినందించారు.

కనీస వేతనం చెల్లించాలి


వైరారూరల్: మాట్లాడుతున్న తాళ్లపల్లి కృష్ణ

వైరారూరల్: వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.400 చెల్లించాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని పాలడుగు గ్రామంలో ఆదివారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మిక సంఘాల చట్టాలను రద్దు చేసే యత్నాలు చేస్తున్న నేపథ్యంలో.. భవిష్యత్ పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. మండల కార్యదర్శి తూము సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కారుమంచి జయరాజు, తోట నాగేశ్వరరావు, బాజోజు రమణ, నల్లమోతు రాజాబాబు, రెహానా, పుష్పరాజ్యం, గుంటమ్మ, మజీద్, బీఫాతిమా తదితరులున్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం ఎన్నిక

కొణిజర్ల: రియల్‌ఎస్టేట్ వ్యాపారుల నూతన మండల కమిటీని ఆదివారం కొణిజర్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీరామ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో సంఘం మండలాధ్యక్షుడిగా దామా శ్రీనివాసరావు(పల్లిపాడు), ప్రధాన కార్యదర్శి దండు కృష్ణ (అనంతారం) సభ్యులుగా రాయల వెంకయ్య, పేరసాని సురేష్, నరసింహారావు, దావీదు లతో పాటు మరి కొంత మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రియల్ ఎస్టేట్ మధ్యవర్తిదారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో నిరుపేద వృద్ధుడు షేక్ లాల్ మహ్మద్ అంత్యక్రియలకు గ్రామానికి చెందిన పారా నారాయణరావు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.6 వేలు అందించారు. మృతదేహాన్ని గ్రామసర్పంచ్ మర్రి తిరుపతిరావు, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి బండి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు షేక్ షరీఫ్, ఖాసీం సాహెబ్, పఠాన్, కరీముల్లా, మస్తాన్, జానీ, పారా వెంకటేశ్వరరావు, తదితరులు సందర్శించి సంతాపాన్ని తెలిపారు.

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి

సత్తుపల్లిరూరల్: మండలంలోని కొత్తూరు మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కంచర్ల సత్యనారాయణ మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తణుకు సత్యనారాయణ, ఫార్మసీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ రోడ్లను బాగుచేయరూ..?

- పనులు మధ్యలో వదిలేస్తున్న గుత్తేదారులు
- ఏళ్ల తరబడి జాప్యం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


కంకర తేలి అధ్వానంగా మారిన పెద్దమండవ - గంధసిరి రహదారి


బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోని గంధసిరి వద్ద బందపువాగు

ముదిగొండ: మండలంలోని పండ్రేగుపల్లి నుంచి మల్లారం వరకు దాదాపు 15 గ్రామాలకు 30కిలో మీటర్ల వరకు ఉన్న లింక్ రహదారులకు 15ఏళ్ల నుంచి రోడ్ల పనులకు మోక్షం కలగడం లేదు. గ్రామాల్లోని అంతర్గత లింక్‌రహదారులన్నీ ఏళ్ల తరబడి గుంతలతో ధ్వంసం అయ్యాయి. దీంతో రైతులు, వాహనదారులు, ట్రాక్టర్లు, ఆటోలు ఇటుగా వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుకుంటూ వెళ్లాల్సిందే. పండ్రుగుపల్లి, ఖానాపురం, కోదండ రామాపురం, ముత్తారం, వల్లాపురం, గంధసిరి, పెద్దమండవ, మల్లారం, నుంచి నిత్యం వందల సంఖ్యలో పలు వాహనదారులు మల్లారం, వల్లభి, జగ్గయ్యపేట, బాణాపురం, తదితర గ్రామాలకు వెళ్లడానికి అనుకూలంగా రహదారి లేక ఈ రహదారి మట్టి రోడ్డు కావడంతో పాటు, కొన్ని చోట్ల కంకర తేలి ఉంది. రైతులు తమ ఎరువులను, పంట ఉత్పత్తులను తరలించడానికి ఈ రహదారులే మార్గాలు. ప్రభుత్వాలు గ్రామీణ రహదారులను బీటీ రహదారులుగా మార్చేందుకు రూ.కోట్లల్లో ఖర్చు చేస్తున్నామని చెబుతున్న మాటలకు ఇదే నిదర్శనం. ఇంత వరకు ఈ మార్గాలు మరమ్మతులకు నోచుకోలేదు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రజలు పలు మార్లు విన్నివించి వినతిపత్రాలు అందజేసినా ఫలితం దక్కలేదు. దీంతో రహదారులన్నీ ప్రతి ఏటా గుంతలతో దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల శిలాఫలకాలు ఎక్కిరిస్తున్నాయి. ప్రజల సౌకర్యార్థం రహదారులు మెరుగుపరచాలని ముదిగొండ మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

చప్టాల వద్ద ఎత్తు పెంచాలి..



రహదారులన్నీ గతంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మంజూరు చేయించి మెరుగుపరిచారు. ఆ రహదారులు ఇప్పుడు కనీసం మరమ్మతులకు కూడా నోచుకోలేదు. ప్రభుత్వాలు స్పందించడంలేదు. రైతులు పొలాలకు వెళ్లడానికి, ట్రాక్టర్లు, ఎరువులు తరలించడానికి వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు చప్టాల వద్ద ఎత్తు పెంచి రాకపోకలు సాగే విధంగా చూడాలి.

– పాలకీటి ప్రసాద్, గంధసిరి

మరమ్మతులు చేయించాలి..



ఏళ్లతరబడి ఈ రహదారులన్నీ ఇలానే ఉన్నాయి. రాళ్లతో, గుంతలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రైతులు వర్షాకాలంలో పొలాలకు వెళ్లాలంటే రోడ్లు కొట్టుకుపోయి, గుంతలు పడి ఉన్నాయి. పూర్తిస్థాయిలో రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించాం. కాని ఎవరూ కూడా పట్టించుకోలేదు. ఇకనైనా లింక్ రహదారులు మెరుగుపరిచి వాహనదారులకు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– కాకుమాని నర్సిరెడ్డి, రైతు, పెద్దమండవ

మధ్యలోనే వదిలేస్తున్నారు..



రోడ్ల మరమ్మతుల పనులను కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలేస్తున్నారు. ప్రతి సంవత్సరం వానాకాలంలో రోడ్డు కొట్టుకుపోవడం వలన పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా, పనులు మాత్రం పూర్తిస్థాయిలో జరపకుండా వదిలేస్తున్నారు. ఇకనైనా అధికారులు రోడ్డు పనులు పూర్తి చేసి రాకపోకలు సాగే విధంగా చూడాలి. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

– కందిమళ్ల వెంకులు, రైతు, పెద్దమండవ

నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ


కొణిజర్ల: దుస్తులు అందిస్తున్న వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్

కొణిజర్ల: కొణిజర్ల బీసీ కాలనీలోని యేసుక్రీస్తు ప్రార్థనా మందిరం నందు బ్యూలా ఛారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరలను వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ చేతుల మీదుగా అందించారు. పాస్టర్ నతానియేల్ జ్ఞాపకార్థం దాని పాల్, వినయ్‌పాల్ చీరలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాములునాయక్ మాట్లాడారు. క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రామారావు, ఆత్మచైర్మన్ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చిరంజీవి, సుడా డైరెక్టర్ కృష్ణ, యేసుక్రీస్తు ప్రార్థనా మందిరం నిర్వాహకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే నివాళి..

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామంలో మైనార్టీ నాయకురాలు షేక్.షకీనా నాయనమ్మ, స్వతంత్ర్య సమరయోధురాలు షేక్.జాన్‌బీ (80) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, మాజీ ఎమ్మెల్యే బాణోతు చంద్రావతిలు వేర్వేరుగా జాన్‌బీ భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం రెబ్బవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా ఎమ్మెల్యే జేసీతో ఫోన్లో మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ బీడికె రత్నం, ఎంపీపీ పావని, సర్పంచ్ రామారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లాల్ మహ్మద్, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పొంగులేటి పర్యటన


చిన్నారికి పట్టువస్త్రాలు అందిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

చింతకాని: మండలంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివారం మత్కేపల్లి గ్రామంలో నిర్వహించిన చింతల రాంబాబు, మాధవి దంపతుల కుమార్తెలు శ్రీవల్లి, శ్రీనిధి ఓణీల వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి పట్టువస్త్రాలు అందించారు. అనంతరం గ్రామంలోని తిరుపతి కొండలరావు, పత్తిపాటి నారాయణ, వేల్పుల సైదులు, జగన్నాథపురం గ్రామంలో కోలేటి సూర్యప్రకాశ్‌రావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బొమ్మెర రామ్మూర్తి, జిల్లా నాయకుడు కోట రాంబాబు, ఖమ్మం కార్పొరేటర్లు మలీదు జగన్, దొడ్డా నగేష్, జగన్నాథపురం గ్రామసర్పంచ్ నాగయ్య, నాయకులు నారపోగు వెంకటేశ్వర్లు, కన్నెబోయిన సీతారామయ్య, వలమల నాగేశ్వరరావు, బూర వీరబాబు, కోలేటి రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రణధీర్

చింతకాని: మండలంలోని కొదుమూరులో ఖమ్మం నగరంలోని లోటస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామసర్పంచ్ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులను అభినందించారు. ఈ శిబిరంలో ఆస్పత్రి వైద్యుడు జడల రణధీర్ సుమారు 350 మంది రోగులకు పలు రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో రాఘవాపురం గ్రామసర్పంచ్ గోవిందరావు, ఎంపీటీసీ సభ్యురాలు హేమ, గ్రామ పెద్దలు, ఆస్పత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి రక్షించాలి

సత్తుపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తుపల్లి జేవీఆర్ ఓసీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ జేఎస్ఆర్ మూర్తి, సీఈఆర్ క్లబ్ సంయుక్త కార్యదర్శి గణపనేని శ్రీనివాసరావు, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మాధవరెడ్డి, ఉపేంద్రాచారి, ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పగిలిన 'భగీరథ' పైప్.. నీరు వృథా


పైపులు పగిలి వృథాగా పోతున్న మిషన్‌భగీరథ నీరు

కల్లూరు రూరల్: మండలంలోని రామకృష్ణాపురం –కొర్లగూడెం క్రాస్‌రోడ్ వద్ద జాతీయరహదారి పక్కన మిషన్ భగీరథ పైపులు పగిలిపోయాయి. అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేయడంతో లీకై నీరు వృథాగా పోతుంది. అయినా సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో గత వారం రోజులుగా పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామాలకు త్రాగు నీటి సరఫరా నిలచిపోయింది.. కొర్లగూడెం, నారాయణపురం, పేరువంచ తదితర గ్రామాలకు వారం రోజులుగా తాగు నీరు సరఫరా కావటం లేదని కొర్లగూడెం సర్పంచ్ బైరెడ్డి నర్సింహరెడ్డి చెప్పారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


బోనకల్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


కారేపల్లి హైస్కూల్‌లో..

బోనకల్: మండలంలోని జానకీపురం గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో ఆదివారం 2001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు శుభకర్‌దాస్, వెంకటరెడ్డి, వీరభదరం, జాన్, సలీం, సుచరిత, స్రవంతి, కోటయ్య, రమణరావులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోట భాను సహాస్, నాగుల్‌మీరా, రేణుక, వసంత, సావిత్రి, లక్ష్మీ, జీవీఆర్, రఫీ, నవీన్, చిరంజీవి పాల్గొన్నారు.

కారేపల్లి: కారేపల్లి హైస్కూల్‌లో 1995 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు జగన్మోహన్‌రావు, శంకరయ్య, సత్యనారాయణ, సత్యప్రసాద్, సురేష్, నరసింహాచారి, రామకృష్ణమాచారి, వైవీ రమణ, పూర్వ విద్యార్థులు రమేష్, తిరుపతిరావు, రమేష్, రాజ్‌కుమార్, సరిత, శేఖర్, ఉపేందర్, శ్రీను, భగవాన్, అలీ, కోటి, పుల్లారెడ్డి, మాధవి పాల్గొన్నారు.

తల్లాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పి.శరత్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శేషగిరి, రామచంద్రరావు, డి.వి.కృష్ణారెడ్డి, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.


తల్లాడ: అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పేదలకు పెద్దన్నగా కేసీఆర్


సత్తుపల్లి: కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి/సత్తుపల్లిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆడబిడ్డలున్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నదని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సీఎం కేసీఆర్ పెద్దన్నగా నిలిచారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కూడా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు లేవన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రోల్‌మోడల్ పరిపాలనను దేశానికి అందించాలనే సంకల్పంతో టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చారని పేర్కొన్నారు. సత్తుపల్లి పట్టణంలో ఒక్క మట్టిరోడ్డు కూడా లేకుండా అన్ని రోడ్లను వచ్చే ఎన్నికల నాటికి సీసీరోడ్లుగా మార్చుతామన్నారు. అనంతరం ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఆల్‌మేవా) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ దొడ్డా హైమావతి, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, జెడ్పీటీసీ సభ్యుడు కూసంపూడి రామారావు, ఆత్మకమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మందపాటి వెంకటరెడ్డి, ఎస్‌కే రఫీ, చల్లగుండల కృష్ణయ్య, గ్రాండ్ మౌలాలీ, అద్దంకి అనీల్, తుంబూరు కృష్ణారెడ్డి, నాగుల్‌మీరా, గఫార్, ఒగ్గు శ్రీనివాసరెడ్డి, మేకల నర్సింహారావు, అబ్దుల్లా, పాలకుర్తి రాజు, దొడ్డా శంకర్‌రావు, ప్రవీణ్, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆదిల్‌షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి అజ్గర్‌ఖాన్, జిల్లా కార్యదర్శులు భాషావలీ, రఫీ, సలీం, ఖలీల్, దస్తగిరి, రషీద్, ఖాజా పాల్గొన్నారు.

చిన్నారికి ఆశీర్వాదం..

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసరెడ్డి, పద్మావతిల కుమారుడు రవీంద్రరెడ్డి - స్వాతి, రాజశేఖర్‌రెడ్డి అనూషల ఇద్దరి కుమారులు అభిరామ్‌రెడ్డి, సౌమిత్‌రెడ్డిల పుట్టినరోజు వేడుకల కార్యక్రమానికి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై చిన్నారులను ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరమోహన్‌రెడ్డి, దూపాటి భద్రరాజు, దగ్గుల శ్రీనివాసరెడ్డి, కేతినేని చలపతిరావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెస్పీ కాల్వ బుంగ పూడ్చివేత


ఎన్నెస్పీ యూటీకి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కొణిజర్ల: మండలంలోని గుబ్బగుర్తి సమీపంలో నాగార్జున సాగర్ ప్రధాన కాల్వ అండర్ టన్నెల్‌కు పడ్డ బుంగ పూడ్చి వేసేందుకు ఎన్నెస్పీ అధికారులు ఆదివారం చేపట్టారు. కాల్వలో నీటిని తగ్గించి బుంగ పడిన ప్రాంతంలో నీటికి అడ్డుగా ఇసుక బస్తాలతో కట్ట వేసి యూటీ బుంగ పడిన ప్రాంతంలో జేసీబీ సాయంతో కొంత మేర తొలగించి టార్పాలిన్ పట్టా వేసి దానిపై ఇసుక బస్తాలు వేయిస్తున్నారు. తాత్కాలికంగా మరమ్మతుల చేపట్టి వచ్చే వేసవిలో పూర్తిస్థాయి మరమ్మతులు నిర్వహిస్తామని డీఈ గోపాలరావు తెలిపారు. మరమ్మతులు ఆదివారం సాయంత్రానికి పూర్తి అవుతుందన్నారు. సోమవారం ఉదయం తక్కువ మొత్తంలో నీరు విడుదల చేసి చూసిన తర్వాత మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో నీరు విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ సతీష్ ఉన్నారు.

ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టవా

ఎర్రుపాలెం: రైతాంగ సమస్యలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని.. నేటికి ఆ ప్రక్రియ పూర్తిచేయలేదన్నారు. రైతు సంక్షేమాన్ని కాలరాస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో అన్నదాతలు బుద్ధి చెబుతారిని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

పాదచారులకు ప్రాణసంకటం

కల్లూరురూరల్: హైవేరహదారుల గుత్తెదారుల నిర్వాకం వల్ల పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైవేరహదారి పక్కన పెద్దపెద్ద రాళ్లతో కూడిన మట్టిని పోశారు. దీంతో పాదచారులు నడిచేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కావున వారి సౌకార్యార్థం మెత్తటి మట్టిని తోలించి చదును చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీపురం రోడ్డుకు మరమ్మతులు

కల్లూరు రూరల్: కల్లూరు పెద్దచెరువు కట్ట నుంచి లక్ష్మీపురం వరకు రహదారి మరమ్మతుల కోసం రూ.1.15 కోట్లు మంజూరూకాగా ఆదివారం పనులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు లోతట్టు రోడ్డు కూడా కొంతమేర కోతకు గురైంది. దీంతో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆ నిధులను మంజూరు చేశారని గ్రామస్తులు శ్రీరంగం, భిక్యా, వేముయోహన్, కనుమతిరెడ్డి కృష్ణారెడ్డి ప్రసాద్, మోతిలాల్ తదితరులు తెలిపారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు


సత్తుపల్లిరూరల్: స్వామివారికి మంగళహారతులు ఇస్తున్న మహిళలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల సీతారామ చంద్రస్వామి దేవాలయంలో జరుగుతున్న తిరుప్పావై వ్రతంలో ఆదివారం 24వ రోజు ఉదయమే మహిళలు స్వామికి మంగళహారతులతో గోదాదేవి నేర్పినట్లుగా దేవుడికి మంగళశాసనం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ రామకృష్ణమాచార్య తిరుప్పావై అనుగ్రహ భాషణం చేస్తూ మన అందరిని రక్షించగలిగే వాడు భగవంతుడే అని అన్నారు. కార్యక్రమంలో పుష్పావతి, సంజీవరెడ్డి, నాగేంద్రమ్మ, వరలక్ష్మి, అరుణకుమారి, ప్రేమలత, శాంతికుమారి, సరస్వతి, సావిత్రి, విజయలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు


సత్తుపల్లిటౌన్: గీతామందిరంలో.. స్వామివారికి ఉయ్యాల సేవ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతా జ్ఞానమందిరంలో గల శ్రీపార్థసారధి స్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసం సందర్భంగా తిరుప్పావై 23వ పాశురం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీపాలంకరణ, ఉయ్యాల సేవ నిర్వహించారు. తిరుప్పావై, భగవద్గీత పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ వెంకటేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, ఏపూరి పురుషోత్తం, రాఘవయ్య, బాల లీలాకృష్ణ, రాధ, సత్యావతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి: పెనుబల్లి కోదండరామాలయం, బయ్యన్నగూడెం శ్రీసత్యనారాయణ ఆలయంతో పాటు మండలంలోని ఆయా దేవాలయాల్లో ధనుర్మాస పూజలు నిర్వహించారు. బయ్యన్నగూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో గోదా దేవి, కృష్ణుడు, గోపికల వేషధారణలతో బృందావనం కార్యక్రమం నిర్వహించారు.

అటెన్షన్ ప్లీజ్

మురుగు తొలగించండి..



ముదిగొండ మండలం బాణాపురంలో వీధి కాలువల్లో మురుగు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. దోమలతో పాటు, దుర్గంధం ఎదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పర్యవేక్షించాలని, పంచాయతీ అధికారులు వీధుల్లోని చెత్తా, చెదారం, కాలువల్లో మురుగును తొలగించి, బ్లీచింగ్ చల్లి పారిశుద్ధ్యం నిర్వహించాలని కోరారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : నాగమణి, పంచాయతీ కార్యదర్శి, బాణాపురం
సెల్ నంబర్ : 7981545940